క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల పరిశీలన



పాఠ్యాంశాలపై విద్యార్థినిని ప్రశ్నిస్తున్న డీవైఈఓ సుబ్బారావు

మచిలీపట్నంటౌన్: నగరంలోని లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీవైఈఓ యూవీ సుబ్బారావు శనివారం పరిశీలించారు. పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అందజేసిన ట్యాబ్‌లలో బైజ్యూస్ పాఠాలు ఎలా చదువుతున్నదీ ఆయన విద్యార్థుల నుంచి ప్రాక్టికల్‌గా తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్, వర్క్ బుక్‌లను ఉపాధ్యాయులు ఎలా సరిచేస్తున్నారో పరిశీలించారు. ఉపాధ్యాయులు చేసిన పాఠ్యాంశాల బోధన ప్రణాళికలను, డైరీలను పర్యవేక్షించారు.

పోచిగానిలంకలో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప శివారు పోచిగానిలంకలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మోపిదేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లక్ష్మీనాథ్ 104 వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 40 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పక్షవాతంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన తాతయ్యకు బీపీ, షుగర్ పరీక్షించి వైద్య సలహాలు అందించారు. సీహెచ్‌ఓ పి. సుగుణ, డీఈఓ ఎస్. అనిల్‌బాబు, డి. పోతురాజు, ఎంఎల్‌హెచ్‌పీ జె. రేఖ, ఏఎస్ఎం పి. లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ డిపో నుంచి భద్రాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. ఈనెల 30 వ తేదీన శ్రీరామ నవమి కాగా 29వ తేదీ సాయంత్రం అవనిగడ్డ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని, ఆన్‌లైన్, డిపో కౌంటర్, ఏటీబీ ఏజెంట్ల ద్వారా రిజర్వేషన్ చేయించుకోవచ్చని వివరించారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

మచిలీపట్నంటౌన్: బృందావన పుర తాపీ మేస్త్రీలు, కూలీల సంఘ భవన నిర్మాణానికి ఆ సంఘ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక బైపాస్‌రోడ్డు వాసవీ భవన్ సమీపంలోని సంఘ స్థలంలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ పల్లి శేఖర్, మాజీ కౌన్సిలర్ కొలుసు హరిబాబు, టీసీ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, ఇంజినీర్లు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మల్లేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, సమస్రనామార్చనలు నిర్వహించారు. కలశ స్థాపన, అఖండ స్థాపన, బలిహరణ, మంత్రపుష్ప నీరాజనాలు, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే



వడాలి జెడ్పీ హైస్కూల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ముదినేపల్లిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్‌డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులు పాఠశాలల్లో ఆటపాటలు, చిత్రలేఖనం ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే విద్యార్థులు పుస్తకాలను పక్కన పెట్టి పలు పాఠశాలల్లో ఆటపాటల్లో మునిగి తేలడంతో పాటు చిత్రలేఖనంతో పాటు నీతి కథలు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వడాలి జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

వీడని వర్షం

- మినుము రైతులకు తీవ్ర నష్టం
- చల్లపల్లిలో అత్యధికంగా 95 మి.మీ వర్షపాతం నమోదు
- మరో రెండు రోజులు వర్షాలు
- ఆందోళనలో రైతులు



అవనిగడ్డలో మినుము రాశులకు కప్పిన పట్టాలు

అవనిగడ్డ: దివిసీమను వర్షాలు వీడటం లేదు. శనివారం కూడా పలు సార్లు వర్షం కురిసింది. నూర్పిళ్లు చేసి మినుములు పొలాల్లో ఉన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట మీదున్న మినుము మొక్కలు కొన్ని చోట్ల నీట మునగడంతో మినపకాయలు పగిలిపోయి, రాలిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట పొలాల్లోనే మినుము

అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో చాలా చోట్ల మినుము పంట పొలాల్లోనే ఉంది. వర్షాలకు దొరక్కుండా మినుము పంటను ఇంటికి చేర్చుకుందామని రెండు రోజుల కిందట యంత్రాలతో నూర్పిళ్లు చేసిన పంట కొన్నిచోట్ల పొలాల్లోనే ఉండిపోయింది. ఆరిన తరువాత పోత పోసి ఇంటికి చేరుద్దామనుకున్న తరుణంలో వర్షం పడటంతో పట్టాలు కప్పి పొలాల్లోనే వదిలేశారు. శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం పలుచోట్ల కుండపోత వర్షం కురవడంతో పట్టాలు కప్పిన మినుము రాశుల్లోకి నీరు చేరిందని, చినుకులకు విరామం లేకపోవడంతో ఇళ్లకు చేర్చుకోలేక పోయామని కొంతమంది రైతులు చెప్పారు. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

చల్లపల్లిలో అత్యధిక వర్షపాతం

కృష్ణా జిల్లాలోనే అత్యధికంగా చల్లపల్లిలో శనివారం 95 మి.మీ వర్షపాతం నమోదైంది. మోపిదేవిలో 38.2, అవనిగడ్డలో 33.6, కోడూరులో 3.8, బంటుమిల్లిలో 29.2, పెడనలో 26. మచిలీపట్నంలో 23.8, మొవ్వలో 22.2, గూడూరులో 20.8, నాగాయలంకలో 20.4, ఘంటసాలలో 17.2, గుడ్లవల్లేరులో 9.8, కృత్తివెన్నులో 8.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో రెండో రోజైన శనివారం నగరంలో వర్షం కురిసింది. మొన్నటి వరకు అధిక ఎండలు కాసి ఎండాకాలం వచ్చేసిందనిపించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. మధ్యాహ్నం భారీ వర్షం కురవగా ఒక్కసారిగా వర్షాకాలాన్ని తలపించింది. శనివారం ఆకాశం మేఘావృతమై ఉండి ఈదురు గాలులు వీచాయి. అడపాదడపా వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణం చల్లబడటంతో నగర ప్రజలు సేద దీరారు.

సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న సీఎం జగన్

గడప గడపకు మన ప్రభుత్వంలో పేర్ని కిట్టుతో ప్రజలు



వృద్ధుడిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తమను ఎంతగానో ఆదుకుంటున్నారని 50వ డివిజన్‌కు చెందిన పలువురు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం 50వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, డ్వాక్రా సున్నా వడ్డీ, ఆసరా, కాపు నేస్తం, పింఛన్లు తదితర పథకాల ద్వారా అన్నివర్గాల వారికి లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తంచేశారు. ఈ పథకాలతో మా కుటుంబ జీవనం సాఫీగా సాగుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మరీదు నాగరాజు, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, కార్పొరేటర్లు పల్లి శేఖర్, ఐనం తాతారావు, జోగి చిరంజీవి, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎగ్గోని గాంధీ, నాయకులు పాల్గొన్నారు.

కంటి వ్యాధులను అశ్రద్ధ చేయవద్దు

అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భానుమూర్తి



గ్లకోమాపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ భానుమూర్తి

మచిలీపట్నంటౌన్: కంటి వ్యాధులను అశ్రద్ధ చేయరాదని, వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర వైద్య విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. భానుమూర్తి అన్నారు. ప్రపంచ గ్లకోమా (కంటిలో నీటి కాసులు) వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం ఆస్పత్రిలో నిర్వహించారు. కంటిలో గ్లకోమా వ్యాధి కారణాలపై డాక్టర్ భానుమూర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ ముఖ్యంగా గుండె జబ్బులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులతో బాధపడే రోగులకు గ్లకోమా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. 35 నుంచి 40 సంవత్సరాల వయస్సుగల వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. గ్లకోమా వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వరప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, జిల్లా అంధత్వ నివారణాధికారి నాగజ్యోతి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత

ఘంటసాల(అవనిగడ్డ): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా ఆదాయంతో పాటు ఆరోగ్యం పెరుగుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత అన్నారు. స్థానిక కేవీకేలో శనివారం చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలు మరే పదార్థాల్లోనూ ఉండవన్నారు. వీటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు సాగుచేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటలక్ష్మీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విత్తన శుద్ధి, పోషక యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ చర్యలను రైతులకు తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కె. రేవతి, డాక్టర్ వి. నవీన్‌కుమార్, కృష్ణవేణి, రైతులు, యువకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లు

మెరకనపల్లి(మోపిదేవి): ఆన్‌లైన్ విధానంలోనే ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని వ్యవసాయ శాఖ అవనిగడ్డ ఏడీఏ జయప్రద తెలిపారు. మెరకనపల్లిలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో కొద్దిసేపు మాట్లాడారు. ఇటీవల ఆఫ్‌లైన్‌లో తీసుకున్న ధాన్యం కూడా ఆన్‌లైన్ చేస్తున్నామని వివరించారు. ఆర్‌బీకే అధికారులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కోడూరు ఇలవేల్పు గంగాభవానీ అమ్మవారు

- నేటి నుంచి అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు
- 48 ఏళ్లుగా పోలీస్ స్టేషన్‌లోనే అమ్మవారికి తొలి పూజ
- ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన పోలీస్‌స్టేషన్



గంగాభవానీ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్) గంగాభవానీ అమ్మవారు

కోడూరు: కోడూరు మండల ప్రజల ఇలవేల్పు గంగాభవానీ అమ్మవారి జాతరోత్సవాలు ఆదివారం ప్రారంభమవుతాయి. 48 ఏళ్లుగా పోలీస్ స్టేషన్‌లోనే అమ్మ వారి తొలి పూజ జరుగుతుండటం ఆనవాయితీ. ఆదివారం ఉదయం చిన్న అమ్మవారిని పోలీసు లాంఛనాలతో స్టేషన్‌కు తీసుకువెళ్లనున్నారు. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన పోలీసులు అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి రాకను పురస్కరించుకొని పోలీస్‌స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఏడాది అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, కోడూరు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ దంపతులు తొలి పూజలు చేయనున్నారు.

ఐదు శతాబ్దాల చరిత్ర

కోడూరు వంతెన సెంటర్ సమీపంలో సుమారు ఐదు శతాబ్దాల కిందట గంగాభవానీ అమ్మవారు వెలిశారు. గ్రామస్తులు అమ్మవారికి చిన్న మందిరాన్ని నిర్మించి పూజలు చేశారు. కాలక్రమంలో గంగాభవానీ అమ్మవారి కోడూరు మండల ప్రజల ఇలవేల్పుగా మారడంతో ఆలయాన్ని నిర్మించారు. అయితే ఆలయ అభివృద్ధి మాత్రం అంతగా జరగలేదు. 48 ఏళ్ల కితం కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించేందుకు వచ్చిన ఏవీఎస్ రెడ్డి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చాడు. గ్రామస్తులతో కలిసి ఆలయానికి అన్ని హంగులను సమకూర్చి జాతరోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జాతరోత్సావాల ప్రారంభం రోజున అమ్మవారిని తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలి పూజలు చేయాలని అప్పట్లో తీర్మానించారు. అప్పటి నుంచి అమ్మవారికి కోడూరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా ఉండే అధికారి తొలి పూజలు చేయడం అనవాయితీగా వస్తోంది.

23న ప్రధాన గుడి జాతర

పోలీసుల తొలి పూజలకు ముందు అమ్మవారికి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు పసుపు, కుంకుమ సమర్పిస్తారని ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. అనంతరం స్టేషన్‌లో పూజలు చేసి, గ్రామోత్సవానికి శ్రీకారం చుడతారు. కోడూరుతో పాటు శివారు గ్రామాలైన స్వతంత్రపురం, దింటిమెరక, మెరకగొడపాలెం, కృష్ణాపురం, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుంది. 22న పశువుల జాతర, 23న అమ్మవారి ప్రధాన గుడి జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని అందంగా అలంకరించారు.

అదృష్టంగా భావిస్తున్నాం



గంగా భవానీ అమ్మవారిని ఆదివారం కోడూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తొలి పూజలు చేస్తాం. అమ్మవారి రాకను పురస్కరించుకొని స్టేషన్‌ను సుందరంగా ముస్తాబు చేశాం. ఉన్నతాధికారులతో పాటు వివిధ ప్రాంతాల్లో పని చేసే పోలీసులు కూడా ఈ ఉత్సవానికి తరలిరానున్నారు. స్టేషన్‌లో అమ్మవారికి పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, ఎస్ఐ, కోడూరు

విద్యార్థుల మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెడన: నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మాక్ పార్లమెంట్‌లో భాగంగా విద్యార్థులు మంత్రులుగా, సభ్యులుగా ఉంటూ స్పీకర్, డెప్యూటీ స్పీకర్లుగా బడ్జెట్ కేటాయింపులు, వాటిని ఏవిధంగా వెచ్చించనున్నది, కేటాయింపులు సక్రమంగా చేస్తున్నా సరిగ్గా వెచ్చించని వైనంపై ప్రశ్నించడం తదితర వాటిపై విద్యార్థులు ఆయా పాత్రలను పోషించారు. సరైన సమాధానాలు ఇవ్వడం, ప్రశ్నించడం చేసిన విద్యార్థినీ విద్యార్థులు పది మందిని ఎంపిక చేసి వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పెడన మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య, కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, జిల్లా ట్రైబుల్ అధికారి ఫణి ధూర్జటి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే రాళ్లు ఏర్పాటు

పామర్రు: రీ సర్వే పనులు పూర్తి అయిన గ్రామాల్లో ముమ్మరంగా సర్వే రాళ్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో శనివారం రీ సర్వే రాళ్ల ఏర్పాటు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 120 ఏళ్ల నాటి సర్వే రికార్డులు ఆధారంగానే ఇప్పటికీ భూ సర్వే చేపడుతున్నామని, ఎన్నో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని గ్రహించిన ప్రభుత్వం సమగ్ర భూ సర్వేలను నిర్వహిస్తోందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఈ సమగ్ర భూముల సర్వే చేపడుతున్నామని చెప్పారు. 100 శాతం కచ్చితత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భూముల రీ సర్వే కోసం అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని తెలిపారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి..


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ విభాగాల అధికారులు సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధునిక సర్వే యంత్రాలతో సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ చెప్పారు. ప్రతి గ్రామానికి ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోతో బృందం ఏర్పాటు చేసి సర్వేలు నిర్వహించామన్నారు. ఈ సర్వే సజావుగా సాగేందుకు తొలుత భూ రికార్డుల స్వచ్ఛీకరణ వీఆర్వో బృందంతో చేపట్టామన్నారు. డీజీపీఎస్, ఈటీఎస్, డ్రోన్ సర్వే ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను ప్రక్షాళన చేసి, దాని ప్రకారం సర్వే నిర్వహించి రైతుల భూముల సరిహద్దులను నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ నంబరు వస్తుందన్నారు. అలాగే 14 అంకెలతో కూడిన గుర్తింపు కార్డును భూమికి కేటాయిస్తామని చెప్పారు. మండల పరిధిలో రీ సర్వే పనులు పూర్తి అయిన 9 గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేరాళ్లను పాతిస్తున్నామన్నారు. మండల పరిధిలో ఇంకా రీ సర్వే పనులు పూర్తి కాని పామర్రు, పెదమద్దాలి, పసుమర్రు, కురుమద్దాలి గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రతి రైతుకు తమ భూములకు సంబంధించి సరిహద్దు రాళ్లు ఉంటాయని, ఈ రాళ్లను ప్రభుత్వం రైతులకు ఉచితంగా వేయిస్తోందని చెప్పారు.వీఆర్వో ప్రదీప్, సచివాలయ సర్వేయర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు శ్రీకారం

గుడివాడటౌన్: గుడివాడ పట్టణ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజ్ఞప్తి మేరకు బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి చొరవతో రూ. 320 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి గతేడాది శంకుస్థాపన జరిగింది. నిర్మాణానికి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల నుంచి సహకారం అవసరం కాగా మున్సిపల్ అధికారులు రోడ్డుపై గల డివైడర్లు తొలగించే పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలుత రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ దీప స్తంభాలను తొలగించారు. ఇప్పటికే భూ సేకరణకు అవసరమైన సొమ్ము చెల్లింపు పూర్తికావడంతో త్వరలోనే రోడ్డు మార్జిన్ ఖాళీ చేయించే పనులను రెవెన్యూ అధికారులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులు పూర్తయిన వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

గురుపూజ మహోత్సవాలు ప్రారంభం

నేటి నుంచి సుదర్శన, నారాయణ హోమాలు



మాట్లాడుతున్న రాజు

మచిలీపట్నంటౌన్: మాస్టర్ ఈకే బాలభాను విద్యాలయం ఆధ్వర్యంలో 39వ గురుపూజ మహోత్సవాలు శనివారం స్థానిక ఫంక్షన్ హాల్లో ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ జగద్గురు పీఠం మచిలీపట్నం నిర్వాహకుడు సీహెచ్ ఎస్ఎన్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లోక కల్యాణార్థం సుదర్శన, నారాయణ హోమాలు నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం ఆరు నుంచి 8 గంటల వరకు అంబరీషోపాఖ్యానం అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో అమెరికాలోని న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన లక్ష్మి, రెడ్డి దంపతులు పాల్గొంటారన్నారు. హైదరాబాద్, బెంగళూరుతో పాటు దేశ నలుమూలల నుంచి జగద్గురు పీఠం ప్రతినిధులు హోమాలలో పాల్గొంటారని చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ

గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏఆర్టీ మందులు వాడుతున్న వారికి పౌష్టికాహారాన్ని శనివారం పంపిణీ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పేషెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారికి మందులు, న్యూట్రీషియన్ ఫుడ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. వారిని ఆదరించడం సమాజ బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా డీఆర్పీ ఎల్ సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, లింక్ వర్కర్‌లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి, దేవి, మంగతాయారు పాల్గొన్నారు.

పెడన బైపాస్ రోడ్డులో చైన్ స్నాచింగ్

పెడన: పెడన బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కట్టా జ్ఞానేశ్వరి రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. శనివారం సాయంత్రం బ్రహ్మపురంలో శుభ కార్యక్రమానికి ఆమె తన కుమారుడు వినయ్‌కుమార్‌తో కలిసి హాజరై మచిలీపట్నం రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద స్కూటీకి పెట్రోల్ కొట్టించుకుంది. రాజీవ్ నగర్ కాలనీకి బైపాస్‌రోడ్డు నుంచి వారు స్కూటీపై బయల్దేరారు. మార్గ మధ్యంలో ఇద్దరు యువకులు వీరి వాహనానికి పక్కగా వచ్చి మాటల్లో పెట్టి జ్ఞానేశ్వరి మెడలోని నానుతాడు, నల్లపూసల గొలుసును తెంచుకుని పారిపోయారు. తేరుకుని వారి వాహనాన్ని వెంబడించినా ఫలితం లేకపోవడంతో బాధితురాలు పెడన పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవీచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

పామర్రు(పమిడిముక్కల): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా సూచించారు. పమిడిముక్కల మండలం తాడంకి జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పారు. పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠ్య పుస్తకాలను చదవాలని సూచించారు. పరీక్షలంటే భయంలేకుండా ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలకు హాజరు కావాలని అప్పుడే మంచి మార్కులు సాధిస్తారని చెప్పారు. పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని, ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన ఫలితాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం శారదా కాంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.